www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 17 జులై 2025



సర్పంచి శిరీష శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తూ...



మహిళా యూనివర్సిటీలో ఉదయం పరీక్ష రాస్తూ...

శభాష్..మానస..!

ఇటు మరణం.. అటు పరీక్ష..!
ఎంఎస్‌సి పరీక్షకు హాజరు
తండ్రికి కొరివి పెట్టిన కుమార్తె

తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె మానస

ప్రజాశక్తి - రేణిగుంట

ఓ వైపు తండ్రి మరణం.. మరోవైపు ఎంఎస్సీ పరీక్ష.. విషాదాన్ని దిగమింగుకుని ఆ కుమార్తె ఎంఎస్‌సి పరీక్షకు హాజరయ్యింది. తరువాత ఇంటికి వచ్చి పుట్టెడు శోకంతోనే తండ్రికి తలకొరివి పెట్టి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.. 'ఎవరన్నారు ఆడపిల్లలు తక్కువ' అని నిరూపించిన మానసప్రియ ధీరత్వాన్ని చూసి 'శభాష్' అని చుట్టుపక్కల వారు మెచ్చుకున్నారు.. వివరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం దిగువ మల్లవరం అరుంధతివార్డులో విషాదం చోటు చేసుకుంది. కె.మస్తాన్‌కు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సుస్మితప్రియ హైదరాబాద్‌లో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్‌గా పనిచేస్తుండగా హార్ట్‌ఎటాక్‌తో ఈ ఏడాది ఏప్రిల్ 8న మృతిచెందింది. కుమార్తె మరణంతో మానసికంగా కుంగిపోయిన తండ్రి మస్తాన్‌కు మూడు నెలల కాలంలోనే పక్షవాతం వచ్చి 15వ తేదీ మంగళవారం మృతిచెందాడు. ఓ వైపు పెద్ద కుమార్తె, మరోవైపు పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి మృతితో ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ. రెండో కుమార్తె మానసప్రియ ఎంఎస్‌సి జువాలజీ చదువుతోంది. తండ్రి మరణవార్త విషాదాన్ని దిగమింగుకుని 16వ తేదీ బుధవారం తిరుపతి మహిళా యూనివర్సిటీలో ఎంఎస్‌సి జువాలజీ ప్రాక్టికల్ పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. విషాదవదనంతోనే తండ్రికి తలకొరివి పెట్టింది. 'పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని, ఆడపిల్లలు భారమని పురిట్లోనే చంపేసిన ఘటనలూ చూశాం..' వీరందరికీ మానసప్రియ చెంపపెట్టుగా నిలిచింది. బాధను దిగమింగుకుని పరీక్ష రాసింది.. తండ్రికి తలకొరివి పెట్టి ఆ కుటుంబం గర్వపడేలా చేసింది.

అలిమేలు మంగాపురంలో 'డెంగీ'

నలుగురికి సోకినట్లు వైద్యపరీక్షల్లో నిర్ధారణ

ప్రజాశక్తి - సత్యవేడు

సత్యవేడు మండలం అలిమేలు మంగాపురం గ్రామంలో డెంగీ కలకలం రేగింది. పలువురికి డెంగీ లక్షణాలు బయటపడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో కొంతమంది డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు అనుమానంతో గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి మంగళవారం సాయంత్రం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు సమాచారాన్ని ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఏఎం పురం గ్రామంలో దాసుకుప్పం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్, సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డెంగ్యూ వ్యాధికి సంబంధించిన రాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలుగురికి డెంగీ లక్షణాలు ఉన్నట్టు బయటపడింది. గీత, గోవిందమ్మలకు డెంగీ ఉన్నట్లు తేలింది. వెంకటరెడ్డి, అభిరామి లకు రాపిడ్ వైద్య పరీక్షల్లో లక్షణాలు కనిపించగా తుది పరీక్షల కోసం పెద్దాసుపత్రికి పంపించారు. డెంగీ నిర్ధారణ అయిన ఇద్దరినీ వైద్య చికిత్స అనంతరం పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు. ఒక చిన్నారి పాపను సూళ్లూరుపేటలోని బాలిక శిశు సంరక్షణ కేంద్రానికి పంపించారు. గ్రామంలోని జ్వరపీడితులకు వైద్య చికిత్స అందించారు. తిరుపతి సబ్ యూనిట్ అధికారి మోహన్ పర్యవేక్షణలో మలాథిన్ మందును పిచికారీ చేశారు. నీటిని కాచి వడగొట్టి తాగాలని సూచించారు. ఇల్లిల్లు తిరిగి ప్రజలకు డెంగీ లక్షణాలను వివరిస్తూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దామోదర్‌రెడ్డి, మునస్వామి యాదవ్, సాయికుమార్‌రెడ్డి, ఢిల్లీబాబుయాదవ్, దాసుకుప్పం పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ సుబ్రమణ్యం, ఎంపిహెచ్ఎస్ మురళి పాల్గొన్నారు.

'అయ్యో'ర్ల కొరత..!

ఉద్యోగ విరమణలతో మరిన్ని ఖాళీలు
సబ్జెక్టులకు అనుగుణంగా ఉపాధ్యాయులేరి?
'విలీనం' పేరుతోనూ విద్యకు దూరం
విద్యాశాఖ ముందస్తు చర్యలు శూన్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

'నేటి బాలలే రేపటి పౌరులు' అని వివిధ కార్యక్రమాలలో, సభలలో ఊదరగొట్టే ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటినా విద్యార్థుల సబ్జెక్టులకు సంబంధించిన, అనివార్యమైన ఉపాధ్యాయులను నియమించడంలో మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు వారి విధుల కాలం, పదవీ విరమణ తేదీలు పక్కాగా సమాచారం ఉన్నా, సకాలంలో డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత లేకుండా, విద్యాబోధన జరిగేలా చూడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించడం లేదు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి నెల రోజులు గడుస్తున్నా కొన్ని సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు లేకపోవడం కారణంగా విద్యార్థులు విద్యాసంవత్సరంలో కొన్ని రోజులపాటు ఆయా సబ్జెక్టులపై పూర్తిస్థాయి అవగాహన కోల్పోతున్నారన్నది వాస్తవం. మంగళం పరిధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ లో విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా హై స్కూలుకు సంబంధించి సాంఘిక శాస్త్రం, బయాలజీ సబ్జెక్టులకు ఇప్పటివరకు టీచర్ల నియామకం జరగలేదు. అదేవిధంగా హై స్కూల్ ప్లస్ కు సంబంధించి ఫిజిక్స్, ఆంగ్లము సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేరు. దీంతో ఈ సబ్జెక్టులకు సంబంధించి పాఠశాల పని దినాలలో హాజరైన విద్యార్థులకు ఈ సబ్జెక్టులపై బోధన చేసేవారు లేకపోవడంతో నెలరోజుల విలువైన కాలాన్ని వారు కోల్పోయినట్లే..

ఆలస్యంగా నియామకం జరిగితే.....

విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచింది. కొన్ని సబ్జెక్టులకు సంబంధించి ఉండాల్సిన సంఖ్యకన్నా తక్కువ ఉపాధ్యాయులు ఉండడం, ఆలస్యంగా నియామకం జరిగితే వచ్చే ఆ ఉపాధ్యాయులు ఆ సబ్జెక్టులను బోధించడంతో విద్యార్థులపై మానసిక భారం మోపిన వారయ్యే అవకాశం ఉంది. కొంతమంది విద్యార్థులు మంగళం ట్రెండ్స్ పాఠశాలలో గణితానికి కూడా ఇప్పటివరకు ఏ ఉపాధ్యాయులు వచ్చి బోధన చేయలేదని 'ప్రజాశక్తి'కి సమాచారం అందడంతో దీనిపై ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడును వివరణ కోరగా ఇకనుండి గణితం బోధించడానికి ఉపాధ్యాయురాలిని పంపుతున్నామని చెప్పారు. ప్రస్తుతం మంగళం ట్రెండ్స్ లో 881 మంది విద్యార్థులు(హై స్కూల్, హై స్కూల్ ప్లస్ కలిపి)ఉన్నారు. రెండింటికి కలిపి 35 మంది బోధన సిబ్బంది ఉండాల్సి ఉండగా 30 మంది మాత్రమే ఉన్నారు.

విలీనం పేరుతో విద్యకు దూరం

రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం మోడల్ స్కూళ్ల పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల విలీనానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాలలో 3, 4, 5 తరగతులను సమీపంలోని పాఠశాలలకు విలీనం చేస్తూ విద్యాశాఖ అధికారులు ప్రక్రియను ముగించారు. అయితే నేటి వరకు పదుల సంఖ్యలో కొన్ని గ్రామాల నుండి గ్రామ ప్రజలు, ఎస్ఎంసి కమిటీ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పేద, దళిత, గిరిజన తెగలకు సంబంధించిన విద్యార్థులు విలీన ప్రక్రియ ద్వారా విద్యను కోల్పోతున్నారని, విలీన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదనే చెప్పాలి. జాతీయ రహదారులు, వాగులు, వంకలు, అటవీ ప్రాంతాలు, మద్యం దుకాణాలు వీటిని దాటుకొని తమ పిల్లలను బడికి పంపాలంటే భయంగా ఉందని, విలీన నిర్ణయాన్ని అధికారులు పునరాలోచించుకోవాలని, వాస్తవ పరిస్థితులను గ్రహించి, పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. అంతిమంగా విద్యార్థులు ఈ విద్యాసంవత్సరంలోఇబ్బందులు పడుతున్నారని చెప్పాలి.

నెలాఖరుకల్లా అన్ని పోస్టులు భర్తీ చేస్తాం : కెవిఎన్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రస్తుతం తిరుపతి జిల్లాలో బదిలీల ప్రక్రియ జరిగింది. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు ఇద్దరు ఉండాల్సిన చోట ఒకరే ఉన్నారు. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరుకు డీఎస్సీ ప్రక్రియ పూర్తవుతున్నందున తిరుపతి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు అన్నింటినీ భర్తీ చేసే అవకాశం ఉంది.

ఆ విద్యార్థులకు 'హాజరు' నిల్

నెలరోజులుగా పస్తులతోనే పిల్లలు

ప్రజాశక్తి- ఏర్పేడు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూల్ పేరుతో బడుల విలీన ప్రక్రియ ద్వారా ఏర్పేడు మండలంలోని పల్లాంపేట దళితవాడలో ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను పల్లాం పాఠశాలలో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విలీనం నిలుపుదల చేయాలని పల్లాం పేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తూ వారి గ్రామంలోని బడికే విద్యార్థులను పంపించడంతో విద్యార్థులకు నెల క్రితం నుండి హాజరు వేయడం లేదని, మధ్యాహ్న భోజనం అందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు మొండి వైఖరిని వీడి పిల్లలకు భోజనం, హాజరు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

విలీనం స్కూలుకు వెళ్లకుండా పాత స్కూల్లోనే విద్యార్థులు

అధికారుల బెదిరింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

దీర్ఘకాలిక డిమాండ్ల సాధనకై నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను అధికారులు బెదిరింపులకు పాల్పడటం శోచనీయమని నాయకులు ధారా కోటేశ్వరరావు, వెంకటరమణ, జోగి శివకుమార్ మండిపడ్డారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె బుధవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్ గ్రేషియా, జీ.ఓ.నెం.36 ప్రకారం వేతనాలు అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మున్సిపల్ కార్యాలయము ఎదుట ఏర్పాటు చేసిన శిబిరాల నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు ప్రదర్శనగా టవర్‌క్లాక్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. నాయకులు మాట్లాడుతూ సమ్మె శాంతియుతంగా చేస్తున్న కార్మికులపై అధికారులు నాయకుల మెప్పు పొందేందుకు బెదిరింపులకు, ఒత్తిడి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాడుతున్నామనే విషయం తెలుసుకోవాలన్నారు. నిత్యవసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండగా ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు. కార్మికులు చాలీచాలని జీతాలతో దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కామేశ్వరరావు, సి.హెచ్. సుబ్బారావు, ఎం.రమణయ్య. ఎస్కే.నయీం, బి.మురళి, గూడూరు మణి, డి. మణమ్మ,

కే.నారాయణమ్మ, ఓ. వరలక్ష్మి, సిఐటియు నాయకులు బి.వి.రమణయ్య, పామంజి మణి, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు బైక్‌ర్యాలీ

నాయుడుపేట : ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, తిరుపతి జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ పట్టణ ఇంజినీరింగ్ కార్మికులంతా ఐకమత్యంతో సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాసులు, కాలేషా, రమేష్, చిరంజీవి, లీలామోహన్, రామచంద్రయ్య, కృష్ణ పాల్గొన్నారు.

భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించండి : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలోని అన్నమయ్య భవన్‌కు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో భక్తుల కోసం మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలో జూలై 22వ తేదిన భక్తులకు అందుబాటులోకి రానున్న నూతన శ్రీవాణి కేంద్రాన్ని అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఆయన బుధవారం ఉదయం పరిశీలించారు. కౌంటర్ వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా టీ, కాఫీ, పాలు, తాగునీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. శ్రీవాణి టికెట్ల సమాచారాన్ని భక్తులందరికీ తెలిసేలా డిజిటల్ స్క్రీన్ల ద్వారా తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తిరుమలలో ఫుడ్ అండ్ వాటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ సుబ్రమణ్యం, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.10,01,116ను దాతలు ముప్పరాజు జగదీష్, కడూరు విజయలక్ష్మిలు క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి విరాళం చెక్కును అందజేశారు. ఛైర్మన్‌తో పాటు బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు ఉన్నారు.

బంగారు కుటుంబాలకు భరోసా ఇవ్వాలి : కలెక్టర్

19న చంద్రబాబు తిరుపతికి రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పేదరికం నిర్మూలన దిశగా 'పి4' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైన్ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ, మార్గదర్శకులతో కలిసి పి 4 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బంగారు కుటుంబాలను గుర్తించామని, టాప్ 10మార్గదర్శకులు, బాటమ్ 20 శాతం బంగారు కుటుంబాల అవసరాల మేరకు విద్య, నైపుణ్యం, వారికి కావాల్సిన అవసరాలను అందించాలన్నారు. ఈనెల 19వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి జిల్లాకు రానున్నారని, ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో ముఖ్యమంత్రి ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తాజ్ హోటల్ , రాస్, అమరరాజా, రోటరీ క్లబ్, పాయ్ వైస్రాయ్ హోటల్ సంబంధించిన ప్రతినిధులు మార్గదర్శకులు పాల్గొన్నారు.

తిరుపతి, రేణిగుంటలో భారీ వర్షం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జూలై నెల మొన్నటివరకూ మండు వేసవిని తలపించింది.. వర్షాకాలంలోనూ ఎండలు మండిపోవడంతో జనం బెంబేలెత్తిపోయారు. అయితే బుధవారం తిరుపతి, రేణిగుంటల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు సేదతీరారు. వృద్ధులు, చిన్నపిల్లలకు ఉపశమనం కలిగింది. అయితే గంటసేపు కురిసిన ఓ మోస్తరు వర్షానికే మురుగుకాల్వలన్నీ నిండిపోయి 'గబ్బు'కొట్టాయి. కొన్ని రహదారులైతే ఏకంగా చెరువులను తలపించాయి.

నేడు 'ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్లను తిప్పికొట్టండి' రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను తమ ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిప్పికొట్టాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక తరపున గురువారం వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని నాయకులు మాధవ్, సాయిలక్ష్మి, రవి, లోకేష్ పేర్కొన్నారు. అదానీ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ప్రజలపై మోయలేని భారాలు పడతాయన్నారు. ఒక్కో మీటరుకయ్యే ఖర్చు సింగిల్ కెవి ఫేజ్‌కు రూ. 8927లు, 3 కెవి 17286లు 93 నెలల్లో ప్రజల నుండి వసూలు చేయడానికి నిర్ణయించారన్నారు. అదానీ ప్రయోజనాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పరిశ్రమలకు, వాణిజ్య సముదాయాలకు బిగించారని, ఇపుడు అపార్టుమెంట్లకు, ప్రజల ఇళ్లకు బిగించడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మేధావులు, ప్రజాసంఘాలు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అల్పాహారం వితరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ స్థానిక ప్రసూతి వైద్యశాల దగ్గర లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గర్భిణీ స్త్రీల సహాయకులకు 325 మందికి ఉచిత అల్పాహార వితరణ చేశారు. 75 మందికి బిపి, షుగర్ టెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షులు బండి మధుసూదన్ రెడ్డి , కార్యదర్శి సి చక్రపాణి, కోశాధికారి వి పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షులు జి శంకర్ పాల్గొన్నారు.

రైల్వేయార్డుల్లో భద్రత ఏది..?

నిర్లక్ష్యంగానే రైల్వేశాఖ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి యాత్రా స్థలంలో రోజుకు 60-70వేల మంది యాత్రికులు రైళ్లలో ప్రయాణిస్తూ ఉంటారు. రోజుకు రైల్వేస్టేషన్‌కు 70 రైళ్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. తిరుపతి రైల్వేస్టేషన్‌లో కేవలం ఆరు ప్లాట్‌ఫారాలే ఉన్నాయి. ప్లాట్‌ఫారాల సంఖ్య తక్కువగా ఉండడంతో చింతలచేను వద్ద ఉన్న రైల్వేయార్డులో పలు రైళ్లను నిలిపేస్తారు. కరీంనగర్ నుంచి తిరుపతికి వచ్చే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఉదయం ఏడు గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైలు తిరిగి తిరుపతి నుంచి సాయంత్రం ఐదు గంటలకు బయల్దేరుతుంది. అప్పటివరకూ ఈ రైలు చింతలచేను దగ్గర ఉన్న రైల్వేయార్డులో నిలిపి ఉంచుతారు. ఈ రైల్వే యార్డు వద్ద చాలా మంది ఆకతాయిలు తిరుగుతూ ఉంటారు. అక్కడే బీడీలు, సిగిరెట్లు తాగుతుంటారు. కొంతమంది గంజాయి బ్యాచ్‌కు ఇదే ఆవాసం. రైల్వే యార్డుల వద్ద ఎటువంటి సెక్యూరిటీ లేకపోవడం గంజాయి బ్యాచ్ చెలరేగిపోవడానికి అవకాశం లేకపోలేదు. యార్డుల్లో ఉండే రైళ్లను బయల్దేరడానికి గంట ముందే ఔటర్ నుంచి తీసుకొచ్చి ప్లాట్‌ఫాంపై ఉంచుతారు. యార్డులోనే దాదాపు ఆరేడు గంటలు నిలిపి ఉంచుతారు. తిరుపతి హిసార్ రైలు భోగి దగ్ధం సందర్భంగా సకాలంలో ఫైరింజన్ రాకపోవడం కూడా మంటలు వ్యాపించడానికి ఆస్కారం ఏర్పడింది. రైల్వే శాఖ వద్ద సీస్ ఫైర్ పనిముట్లు కూడా చాలా తక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. హిసార్ రైలు బోగి దగ్ధం కావడం పట్ల రైల్వేబోర్డు ఉన్నతాధికారులు ఇప్పటికే విచారణ చేపట్టారు. ఈ భోగి ఎవరైనా కావాలనే కాల్చేశారా? ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగిందా? లేదంటే రైలు బోగీలో బ్యాటరీలో ఏదైనా లోపం ఏర్పడిందా? అనే దిశగా విచారణ జరుపుతున్నారు. పక్కనే ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ కూడా కాలడంతో రైల్వేశాఖకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. రైల్వే ప్లాట్‌ఫారాల్లో మాత్రమే సిసి కెమెరాలు ఉంటాయి తప్ప, యార్డుల్లో లేకపోవడం భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పడమర, తిరుచానూరు రైల్వేస్టేషన్ల వద్ద కొంతవరకూ భద్రత ఉంటుంది. అయితే చింతలచేను వద్ద ఉన్న రైల్వేయార్డు వద్ద భద్రత అంతగా లేదనే చెప్పాలి. ఇకనైనా రైల్వే ఉన్నతాధికారులు రైల్వే ఆస్తుల భద్రత విషయంలో పక్కా ప్రణాళికతో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, సెక్యూరిటీ సిబ్బందిని పెంచే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చిన్న సూపర్ మార్కెట్‌ల్లోనూ, అపార్టుమెంట్‌ల్లోనూ, హోటళ్లలోనూ ఎక్కడ చూసినా సిసి కెమెరాలే.. ఎందుకంటే తమ ఆస్తులకు భద్రత అవసరమని ఆయా యజమానులు భావించారు కాబట్టి.. అయితే తిరుపతి వంటి ప్రముఖ యాత్రా స్థలంలో రైల్వే యార్డులో భద్రత లేదనే చెప్పాలి.. తాజాగా హిసార్ రైలు బోగి తిరుపతి రైల్వేయార్డులో దగ్ధమయ్యింది. అయితే కారణం ఏంటన్నది ఇప్పటికీ తెలియరాలేదు. అధికారులు ఇప్పటికీ విచారిస్తూనే ఉన్నారు. యాత్రాస్థలమైన తిరుపతిలో గంజాయి బ్యాచ్ కోరలు చాచి ఉంది.. ఎవరైనా గంజాయి మత్తులో సిగిరెట్ తాగి పడేశారా? లేక ఇంకేమైనా కారణమా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. 2012-13 సంవత్సరంలోనూ రైల్వే యార్డులో ఇదేవిధంగా ఓ భోగి పూర్తిగా దగ్ధమైంది.

'యోగా'ంధ్ర...'మద్యా'ంధ్ర..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఓ పక్క రాష్ట్రాన్ని యోగాంధ్రను చేస్తామంటూనే..మరో పక్క మద్యాన్ని ఏరుల్లా పారిస్తోంది కూటమి సర్కార్. యోగా చేయండి.. ఆరోగ్యవంతులవ్వండి అంటూనే.. కోడి కూసిందగ్గర నుంచి నిద్ర పోయే వరకు ప్రజల చేత మద్యాన్ని తాగిస్తోంది. ఇందుకు నిదర్శనమే ఇక్కడ కనిపిస్తున్న ఫొటో. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహ ప్రహరీ గోడకు అధికారులు యోగాకు గుర్తుగా పెయింటింగ్ వేశారు. ఆ పెయింటింగ్ కింద ఓ మందు బాబు తాగి దొర్లుతుండడం 'ప్రజాశక్తి' కెమెరాకు చిక్కింది.

కుటుంబం, పిల్లలు ఏమీ పట్టదు.. బాధ్యతలు అసలు పట్టించుకోరు.. తప్పతాగి నడవలేక మందుబాబుల తిప్పలు ఇవి..

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మధ్యవర్తిత్వం మీడియేషన్ ప్రాముఖ్యతను తెలుపు తూ ఈ నెల 10వ తేదీ నుండి కక్షిదారులకు పలు రకాలు గా అవగాహన కల్పిస్తున్నా మని గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగ పవన్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు భవనం నుండి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను తెలుపుతూ జడ్జీలు, లాయర్లు నరసింగరావుపేటలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల త్వరితగతిన కేసులు పరిష్కరించు కోవచ్చని డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చని తెలిపారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : కోర్టులో పెండిం గ్ కేసుల భారాన్ని తగ్గించ డానికి, మధ్య వర్తిత్వం ద్వారా కేసు లు పరిష్క రించుకో వచ్చని ఈ మార్గం ద్వారా కక్షి దారులకు న్యాయం అందించేందుకు వీల వుతుందన్నారు. ఈ పద్ధతిని స్వాగతించాలన్నారు. రాష్ట్ర న్యాయ సేవా అధికారి సంస్థ ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను తెలిపే ర్యాలీని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షులు సిఎస్ రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సి జానకి, అదనపు జూనియర్స్ జడ్జి కె రమ్య సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గాలి సురేష్ బాబు, కార్యదర్శి రాజేష్, శేషసాయి పాఠశాల కరస్పాండెంట్ ఇంద్రజిత్తు, కేకేసి న్యాయ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరులో

రామచంద్రపురం (పాకాల): కక్షి దారులు, ప్రజలు రాజీ మార్గాన్ని ఎన్నుకుంటే ప్రశాంత జీవితాలను సాగించవచ్చని పాకాల మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, పాకాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.పూర్ణిమదేవి అన్నారు. బుధవారం పాకాల మండలంలో ఏపీ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. మీడియేషన్ ఫర్ ది నేషన్ అనే కార్యక్రమంపై పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు గురుస్వామి నాయుడు, చిన్న రెడ్డప్ప నాయుడు, చంద్రమోహన్, గౌరీ శంకర్ రాజు, ఎస్ఎన్ఎం సలీం, సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రవీణ్ ప్రకాష్, మధుసూదన్ రెడ్డి, సునీల్, కోర్టు సిబ్బంది మధు, మీనా పాల్గొన్నారు.

గ్రామీణ ఇళ్లు పరిశీలన

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల కేంద్రంలోని శ్రీ ధనమల్లి గ్రామంలో నిర్మిస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లను తిరుపతి జిల్లా హౌసింగ్ అధికారి పి దయాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతూ 'మీకు ఫస్ట్ ఫేస్‌లో మీ ఖాతాలోకి డబ్బులు వచ్చాయా?' అని ప్రశ్నించగా వచ్చాయని లబ్ధిదారులు తెలిపారు. మిగిలిన రావాల్సిన బిల్లులు కూడా త్వరలోనే వస్తాయని వాటికి సంబంధించిన డాక్యుమెంట్ లన్నీ హౌసింగ్ వాళ్ళ జిల్లాకి పంపారని త్వరలోనే మిగిలిన మొత్తం మీకు జమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటూ గూడూరుకు చెందిన హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ శ్రీనివాసరావు, మండల ఇన్‌ఛార్జి ఏఈ కిలివేటి మోహన్ పాల్గొన్నారు.

మా భూమి కబ్జా చేశారు..!

రక్షించాలని బాధితుల అభ్యర్థన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కొడుకు సుమన్ చెప్పాడని మాజీ ఎంపీపీ గోవిందస్వామి కుమారుడు ముఖేష్ తన అనుచరులతో వచ్చి తమ స్వయార్జితంగా సంక్రమించిన భూమిని దౌర్జన్యంగా కబ్జా చేస్తున్నారని, రక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు వెంకటేశం, రమేష్ కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ నారాయణవనం మండలం ఎరుకంబట్టు గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్లు 86/1లో 77 సెంట్లు, 86/2లో 1.92 సెంట్లు, 86/3 లో 14 సెంట్లు వెరసి మొత్తం ఎ2.83 సెంట్ల భూమి తాత చంద్రప్ప కృష్ణప్ప మొదలి పేరుపై ఉండగా, ఆయన కుమారులు ఐదుగురికి వారసులమైన తమకు భాగ పరిష్కారం కేసు తిరుపతి జూనియర్ కోర్టులో నడుస్తోందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ గోవింద స్వామి కుమారుడు ముఖేష్ తన అనుచరుల వెంటబెట్టుకొచ్చి తమ స్థలంలో జెసిబిల సాయంతో చదును చేస్తుండగా అడ్డుకున్నామని, వారు తమపై దౌర్జన్యానికి దిగి ' మీ అంతు చూస్తాం..' అని హెచ్చరించారన్నారు. తమ స్థలంలో ఉన్న వ్యవసాయ బావిని కూడా పూర్తిగా కబ్జా చేశారని అందుకు సంబంధించిన చిత్రాలను మీడియాకు చూపించారు. దీనిపై కలెక్టర్, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. తమ భూమికి సంబంధించిన న్యాయం చేయాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో పన్నీర్ సెల్వం, దొరైరాజ్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం లో వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో బుధవారం ఎస్వీయూ లో తెలుగు లో పిహెచ్‌డి చేసి, ముద్రించిన పరిశోధన గ్రంథాన్ని ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు ఆవిష్కరించారు. తిరుపతిలోనే సిపిఐ విభాగంలో పనిచేస్తున్న డా. సింగమాల చంద్రయ్య ఎస్వీయూ ఓరియంటల్ పిహెచ్‌డి పూర్తిచేశారు. 'రాచపూటి రమేష్ సాహిత్యం - పరిశీలన' గ్రంథాన్ని ఇంచార్జీ ఉపకులపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి పనులు చేస్తూ జీవనం సాగించే వారి జీవితాలు ఇప్పటికీ పెద్దగా మారలేదని, వారి బతుకులను వర్ణిస్తూ ఎన్నో కథలు, నవలలు వచ్చాయన్నారు. జౌళి శాఖలో అధికారిగా పనిచేసే రాచపూటి రమేష్ చేనేత వృత్తిదారుల జీవితాన్ని వివరిస్తూ రాసిన కథలపై పరిశోధన చేశారు. డా. చంద్రయ్య ఆ గ్రంథాన్ని పుస్తకం రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథకర్తతో పాటు ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పిసి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ చంద్రయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పుష్పలత, డా.నారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, డా. నారాయణ గౌడ్, నిఘా విభాగం అధికారి వెంకటేష్ ,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'చెస్'పై శిక్షణ ఇవ్వాలని చర్చలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శాప్ చెస్ అభివృద్ధి సంస్థ చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాలర్స్ దివాకర్‌రెడ్డి నాయకత్వంలో ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్ ధ్యాన్‌చంద్ మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. దివాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో జిల్లా నుంచి జాతీయ అంతర్జాతీయ చెస్ మాస్టర్లు ఎదిగారని గుర్తు చేశారు. డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చెస్‌పై శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ సహకారంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలోనే విద్యార్థులకు చెస్‌పై శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నుంచి కెవి శర్మ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాలకట్ల ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు పాల్గొన్నారు. పెద్దజీయర్‌స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేశారు. చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈవో, ఇతర ఉన్నతాధికారులు వెంట వచ్చారు. నాలుగు పట్టు వస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామి వారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తన తలకు శ్రీవారి పాద వస్త్రంతో పరివట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించారు. టిటిడి తరపున ఈవోకు 'లచ్చన' అనే తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కడితేలే తగిలించారు. తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాలచెంత ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది. మహంతులు దేవస్థాన ప రిపాలనను స్వీకరించిన రోజు ఆణివార ఆస్థానం పర్వదినం నుంచి టిటిడి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టిటిడి ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి- ఏప్రిల్ నెలకు మార్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథంపాల్గొన్నారు.

శ్రీరంగం నుండి పట్టువస్త్రాలు సమర్పణ

ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం శ్రీ రంగనాథస్వామి తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయ శాఖ అదనపు కార్యదర్శి మణివాసగం, శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ శివరామ్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సుందర బట్టర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి

యువతకు డిఎస్‌పి పిలుపు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : యువత మత్తు కలిగించే డ్రగ్స్ వ్యసనాలకు బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలని నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు సూచించారు. తిరుపతి ఎస్‌పి విహర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దొరవారిసత్రం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో బుధవారం 'డ్రగ్స్ వద్దు-జీవితం ముద్దు' అనే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ నేటి యువత పలు రకాల మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రధానంగా గంజాయి, వంటి వాటికి దూరంగా ఉండాలని యువతను హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా వారి దినసరి చర్యలు, ప్రవర్తనలో మార్పులు గమనిస్తూ, మంచి నడవడికలో నడిచేలా సరిచేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్ ఉపయోగాలు గురించి వివరించారు. నేటి యువత ప్రారంభ దశలో సిగరెట్, మద్యపానంతో ప్రారంభించి గంజాయి, హాన్స్, గుట్కా వంటి వాటికి బానిసలు కాకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సంగమేశ్వర రావు, ఎస్ఐ అజయ్ కుమార్, టిడిపి నాయకులు రత్నయ్య, ప్రసాద్ నాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి చెంచుబాబు

బద్రి పీర్‌కుమార్‌కు పలువురి అభినందనలు

బద్రి పీర్‌కుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో డాక్టరు నందమూరి తారకరామ రావు, భారతరత్న పివి నర్సింహారావు జయంతి ఉత్సవాలు-2025ను పురస్కరించుకుని స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బద్రి పీర్ కుమార్ ఎన్‌టిఆర్ జాతీయ అవార్డు పొందినందుకు ఆ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ , పలువురు అభినందనలు తెలిపారు. ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బద్రి పీర్ కుమార్ ఇటీవల తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదయినందుకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివ ప్రసాద్ తోటి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను ప్రశంసించారు. బద్రి పీర్‌కుమార్ ఎన్‌టిఆర్ జాతీయ అవార్డు పొందడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పీర్ కుమార్ గత 25 సంవత్సరాలుగా అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూనే నటనపై మక్కువ చూపుతూ టీవీ, నాటక రంగంలో నటిస్తూ రచయితగా కూడా గుర్తింపు పొందడంతో ఈ మధ్య కందుకూరి విశిష్ట పురస్కారం లభించిందని తెలిపారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జాతీయ అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరుగుతుందని, విద్యా, కళారంగానికి తన వంతు సేవలు అభినందనీయమని కొనియాడారు. అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర, డాక్టర్ కే కోటేశ్వరరావు, శ్రీధర్ శర్మ, కె రవిరాజు, లక్ష్మీ హిమబిందు, గోపాల్ వున్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించకుంటే ప్రమాదం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్లాస్టిక్ మన జీవితంలో భాగమైనప్పటికీ దాని వినియోగంపై నియంత్రణ లేకుంటే మన భవిష్యత్తు ప్రమాదంలో పడి ప్రశ్నార్థక మవుతుందని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా కళాశాల వృక్ష శాస్త్ర విభాగం, కళాశాల ఇకో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్, అవసరం లేకపోయినా వాడుతున్న ప్లాస్టిక్ వస్తువుల గురించి, ప్లాస్టిక్‌ను పునర్వినియోగం చేసే విధానాల గురించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల ఎన్నో అనర్థాలు వున్నాయని వెంటనే వాటిని నిషేధించాలన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు, ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె కోటేశ్వరరావు, ఇకో క్లబ్ కన్వీనర్ ఎస్ పద్మావతి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి సుజన, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, అధ్యాపకులు డాక్టర్ ఆర్‌బి వాణిశ్రీ, డాక్టర్ శ్యామ్సన్ రాజు, డాక్టర్ కందేరి శ్రీదేవి, డాక్టర్ వసంత కుమార్, టి నరసింహులు, డాక్టర్ పి హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మహాసభలను జయప్రదం చేయండి: సీపీఐ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఈనెల 18వ తేదీ నిర్వహించనున్న తిరుపతి నగర సీపీఐ 14వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి మురళి పిలుపు నిచ్చారు. సభ విజయవంత చేయాలని కోరుతూ కార్మికులకు, ప్రజలకు బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు సీపీఐ పరిష్కరిస్తోందని, ఈ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

పారిశుధ్య పరిరక్షణపై దృష్టి సారించాలి: డిడివో

మాట్లాడుతున్న డిడివో వాణిరెడ్డి

ప్రజాశక్తి-వాకాడు: పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య పనులపై దృష్టి సారించి అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాణిరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వాకాడు లోని బీసీ కాలనీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి రోడ్లు, డ్రైనేజీలు పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. గృహ యజమానులు పారిశుధ్య కార్మికులు కార్మికులతో సహకరిస్తే సమిష్టి కృషితో అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సర్వేలు తదితర విషయాలను ఎంపీడీవో శ్రీనివాసులు డిడిఓ కి వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమతుల ఆహారం ఆరోగ్యానికి తొలి అడుగు

- డాక్టరు గిరిజ కుమారి

అవగాహన కల్పిస్తున్న డాక్టరు గిరిజ కుమారి

ప్రజాశక్తి- ఏర్పేడు: సమతుల ఆహారం ఆరోగ్యానికి తొలి అడుగు అని డాక్టరు గిరిజ కుమారి అన్నారు. ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ బలోపేత కార్యక్రమాన్ని (ఎఫ్ఎస్‌పి)లో భాగంగా 'పోషకాహారం, సమతుల ఆహారం'పై ప్రత్యేక అవగాహన, శిక్షణ విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణలో అక్కుర్తి, పల్లం, చింతలపాలెం క్లస్టర్ల నుండి వచ్చిన 80 మంది సంరక్షకులు హాజరయ్యారు. ముఖ్య వక్త ప్రముఖ ఆరోగ్య, ఫిట్‌నెస్ నిపుణురాలు డాక్టరు గిరిజ కుమారి శరీరానికి అవసరమైన ప్రాథమిక పోషక పదార్థాలైన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్ల ప్రాముఖ్యతపై వివరించారు. అనారోగ్య నివారణలో సమతుల ఆహారం, సీజనల్ ఫుడ్స్ పాత్రను ఆమె వివరించారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ముఖ్య వక్త ప్రముఖ న్యూరో , స్పైన్ సర్జన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టరు అనంత్ కిరణ్ జీవనశైలి నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ధైర్యం, సక్రమ ఆహారపు అలవాట్లు, సీజనల్ వ్యాధుల నివారణకు ఎంతో ఉపయోగమని వివరించారు. ఎస్ఓఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమం కుటుంబాల స్థిరమైన అభివృద్ధికి నిబద్ధతగా పనిచేస్తూ ఆరోగ్యమైన, ధైర్యవంతమైన, భవిష్యత్‌కు సిద్ధమైన సమాజాన్ని నిర్మించేందుకు ఈ అవగాహన, శిక్షణ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌పి లోకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సహోద్యోగులు మునిరత్నం , వెంకటరమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గాలి సతీష్‌నాయుడును పలుకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: పుత్తూరు రూరల్ మండలం తిరుమల కుప్పంకు చెందిన నాయకులు గాలి సతీష్ నాయుడు తల్లి జిఆర్ శుబ్బరత్నమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం వారి స్వగృహానికి వెళ్లిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వారిని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు చినబాబు , టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చెప్పిందే చేస్తున్నాం: టిడిపి

ప్రజాశక్తి -చిట్టమూరు: 'సుపరిపాలనలో తొలి అడుగు'ను చిట్టమూరు మండలంలో గణపతి కిషోర్ నాయుడు సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రజల సౌకర్యార్థం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మల్లం నుంచి తిరుపతికి, మల్లం నుంచి చిట్టమూరు మీదుగా చెన్నై వెళ్లే బస్సు సర్వీసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటుచేసిన ఆర్టీసీ డిపో ఆర్ఎం, డిఎం పెంచలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. చిల్లమూరు, మొలకలపూడి గ్రామాలలో ప్రజల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచి అభివృద్ధి, పథకాలను వివరించారు. ప్రజల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, మారంరెడ్డి. జనార్దన్ రెడ్డి, గుండుబోయిన కస్తూరయ్యా, దువ్వూరు మస్తాన్ రెడ్డి, దువ్వూరు భారతమ్మ, సునీల్ రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు, వాకాడు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురం (తిరుపతి రూరల్): టిడిపి ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని వేదాంతపురం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకుల పరంధామ్ యాదవ్ అన్నారు. బుధవారం కూటమి ప్రభుత్వ పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులైన తాగునీరు, మురికి నీటి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలోనే పల్లె పండుగలో భాగంగా గ్రామాలలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఏడాది పాలనలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టి చిరంజీవి రెడ్డి, ఎం శ్యాంబాబు, పి జయచంద్ర, చంద్ర, ముదిరాజ్ రవిరెడ్డి కుమార్ స్వామి, ఏ ఢిల్లీ యాదవ్, రఘురాం రెడ్డి, సాయి, మాధవ్, నవీన్ ,పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు పంచాయతీ బత్తినయ్య ఎస్‌టి కాలనీ లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా బుధవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా? లేదా అని అడిగి తెలు సుకున్నారు. ప్రజలు సమస్యలు వెంటనే పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, మండల నాయ కులు నాగరాజు నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి, పేరం ధనంజయల నాయుడు, నైనారు పున్నారావు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తిరుపతిలో మినిస్టర్ వైట్ స్టోర్, ఓట్టో స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చెన్నైకి చెందిన ప్రముఖ భారతీయ బ్రాండ్ మినిస్టర్ వైట్, భారతదేశంలో ధోతీలను ధరించే సంప్రదాయాన్ని పునరుద్ధరిస్తూ, తన 48వ ఎక్స్‌క్లూసివ్ బ్రాండ్ ఔట్‌లెట్ (ఈబీఓ)ను బుధవారం తిరుపతి గాంధీ రోడ్డులో ప్రారంభించింది. దీంతో నగరంలో ఈ స్టోర్ల సంఖ్య రెండుకు చేరింది. నగరంలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో ఇదే సంస్థకు చెందిన ఓట్టో మెన్స్ వేర్ స్టోర్‌ను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ పోతిరాజ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ప్రస్తుతం మినిస్టర్ వైట్ బ్రాండ్ దేశ వ్యాప్తంగా 5 వేలకు పైగా మల్టీ-బ్రాండ్ ఔట్‌లెట్‌ల (ఎంబీఓలు) ద్వారా రిటైల్ విక్రయాలు చేస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి 100 ఈబీఓలను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా మినిస్టర్ వైట్ బ్రాండ్‌కు చెందిన ఓట్టో క్లోతింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ పోతిరాజ్ మాట్లాడుతూ రెండేళ్లుగా ఎయిర్ బైపాస్ రోడ్డులోని తమ మొదటి స్టోర్ ద్వారా తిరుపతిలో ఎంతో ఆదరణ లభిస్తోందన్నారు. ఆ ప్రోత్సాహం తోనే గాంధీ రోడ్డులో రెండో స్టోర్‌ను ప్రారంభించామని తెలిపారు. తమకు అండగా నిలిచిన వినియోగ దారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మినిస్టర్ వైట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేష్ రామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంప్రదాయ దుస్తుల రంగంలో వినియోగదారుల విభిన్న అవసరాలకు అనుగుణంగా ట్రెండీ, ఫ్యాషనబుల్ శ్రేణిని అందిస్తున్నామని చెప్పారు. అన్ని వయసుల వారికి, వివిధ సందర్భాలకు సరిపోయే షర్టులు, ధోతీల కాంబో-ప్యాక్‌లు, క్యాజువల్, పండుగలకు సరిపోయే కుర్తాలు, ఫాబ్రిక్ మెటీరియల్స్ ను అందిస్తోందన్నారు. వెస్ట్‌లు, బ్రీఫ్‌లు, పిల్లల దుస్తులను కూడా అందిస్తోందని చెప్పారు. తమిళనాడు , పుదుచ్చేరిలో 32 స్టోర్‌లు, ఆంధ్రప్రదేశ్‌లో 6, తెలంగాణ, కర్ణాటకలో నాలుగు, కేరళలో ఒక స్టోర్ ఉన్నాయని వివరించారు. ఈ బ్రాండ్ ఈ ఏడాది విస్తరించాలని ప్రణాళికలు రూపొందిస్తోందని, యూఎస్ఏ, యూకే, మిడిల్ ఈస్ట్, ఆగ్నేయాసియాలోని భారతీయ జనాభా ఉన్న అంతర్జాతీయ మార్కెట్‌లలో విస్తరణ కోసం ప్రయత్నిస్తున్న ట్టు తెలిపారు. ఓట్టో చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వర్ష పోతి శివశంకరన్ మాట్లాడుతూ ఓట్టో బ్రాండ్ స్టైలిష్, సౌకర్యవంతమైన పురుషుల దుస్తుల శ్రేణితో లక్షలాది వినియోగదారులను ఆకర్షిస్తోం దన్నారు. పాన్-ఇండియా సినిమా నటుడు దుల్కర్ సల్మాన్ దశాబ్ద కాలంగా తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నట్టు తెలిపారు. నాణ్యమైన వస్త్రాలు, సరసమైన ధరలకు తమ వద్ద లభిస్తాయని, వినియోగదారులు దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దేవర మనోహర్, రాజారెడ్డి, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, పాల్గొన్నారు.

'శ్రీసిటీ-బెంగుళూరు' స్లీపర్ బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శ్రీసిటీ నుంచి బెంగళూరుకు డైలీ ఏసీ స్లీపర్ నూతన బస్సు సర్వీసు ప్రారంభమైంది. ప్రముఖ అంతరాష్ట్ర ట్రావెల్ సంస్థ 'గో టూర్ ట్రావెల్స్ అండ్ హాలిడేస్' దీనికి శ్రీకారం చుట్టింది. రాత్రిళ్ళు సౌకర్యవంతమైన ప్రయా ణం కోరుకుంటున్న శ్రీసిటీ నివాసితులు, పరిశ్రమ నిపుణులు, ఇతర సందర్శకుల చిరకాల డిమాండ్‌ను ఈ సర్వీసు నెరవేర్చిం ది.ఈ బస్సు ప్రతిరోజూ శ్రీసిటీ నుండి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి ఉదయం 5.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయా ణం లో బెంగళూరు నుండి రాత్రి 9 గంటల కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6గంటలకు శ్రీసిటీ చేరుతుంది. తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి, చిత్తూరు, కోలార్, హోస్కో ట్ మార్గం గా ఇతర కీలక పట్టణా లను కలుపు తూ ఇది ప్రయాణం చేస్తుంది.

క్రైం న్యూస్

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి కె మురళీమోహన్

40 ద్విచక్ర వాహనాలకు అపరాధ రుసుం

విద్యార్థులకు ఆర్‌టీవో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు వాహన చట్టాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చి అపరాధ రుసుం విధించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలో వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడపడంతో 40 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుంగా రూ.50 వేల రూపాయలు వసూలు చేశారు. మొదటిసారి పట్టుబడిన వాహనదారులకు రవాణా శాఖ చట్టాలను వివరిస్తూ, మొదటిసారి అపరాధ రుసుంతో విడిచిపెడతామని, రెండవసారి నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వాహనాన్ని నడిపితే న్యాయ స్థానాలలో విచారణలు సాగిస్తామని హెచ్చరించారు. భద్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న హెల్మెట్లు వినియోగించాలని, వేగ పరిమితులకు కట్టుబడి వాహనాలను రోడ్లపై నడపాలని విద్యార్థులకు సూచించారు. ఈ వాహన తనిఖీలలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికానాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

భక్తులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి తిరుమల: తిరుమల ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా కారు ప్రమాదానికి గురై ఆరుగురి ప్రాణాలు మృత్యువు చివరి అంచుల వరకు వెళ్లివచ్చారు. పోలీసుల కథనం మేరకు..చిత్తూరుకు చెందిన ఆరుగురు భక్తులు బుధవారం శ్రీవారి దర్శనానంతరం కారులో తిరుగు పయనమయ్యారు. తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని చివరి మలుపు దాటిన తరువాత కారు ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్‌ను దాటి చెట్టును ఢీకొంది. దీంతో కారులో వున్న ఆరుగురి భక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న విజిలెన్స్, రోడ్డు భద్రతా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారును ఘాట్ రోడ్డు నుంచి తొలగించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చూశారు. కాగా, ఘాట్ రోడ్డుపై భారీ ప్రమాదం తృటిలో తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణిలకు వివరాలు, ప్రమాదానికి కారణాలు తెలియాల్సి వుంది.

లోయలోకి దూకిన భక్తుడు

అవ్వాచారి కోనలో వెలికి తీత

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల నడక మార్గంలో ఓ భక్తుడు లోయలోకి దూకగా విజిలెన్స్ అధికారులు అవ్వాచారి కోనలో అతడిని బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆ వ్యక్తి చికిత్స పొందుతున్నాడని విజిలెన్స్ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. తిరుమల నడకమార్గంలోని అవ్వాచారి కోన వద్ద ఓ వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి సమయంలో లోయలోకి దూకాడు. ఇది గమనించిన కొందరు భక్తులు వెంటనే తిరుమల విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనపై అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లోయలో పడిపోయిన వ్యక్తిని గుర్తించి అతడిని బయటకు తీసే ప్రయత్నాలు చేశారు. ఆ వ్యక్తిని అక్కడి నుంచి పైకి తీసి వెంటనే తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. దీంతో పాటు అతని వివరాలను కూడా సేకరించిన అధికారులు.. అతడు కడప జిల్లాకు చెందిన దోర్నపాడు గ్రామానికి చెందిన బోయ మాధవ రాయుడు అని గుర్తించారు. ప్రమాదం వల్ల అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతడు లోయలోకి ఎందుకు దూకాడన్న విషయం ఇంకా తెలియరాలేదు.

వన మహోత్సవం నిర్వహిస్తున్న నారాయణ టెక్నో స్కూలు విద్యార్థులు

'నారాయణ'లో వన మహోత్సవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం టెక్నో స్కూలులో బుధవారం వన మహోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల వద్ద రకరకాల మొక్కలు నాటించారు. 'పర్యావరణ పరిరక్షణ, పచ్చని చెట్టు-ప్రగతికి మెట్టు' అన్న సందేశంలో కూరగాయల మార్కెట్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, వర్షపాతం పెంచుకోవచ్చని ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, ఏజిఎమ్ శ్రీనివాసులు, కో ఆర్డి నే టర్ గాయత్రి, వైస్ ప్రిన్సిపాల్ లత, సురేష్, దేశయ్య పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణం లోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలు లో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూ రు వైజెపి , టౌన్ క్లబ్ సేవ కార్యక్ర మం లో భాగంగా వృద్ధులకు ఫల సరుకు లను పంపిణీ చేశారు.

IN THE COURT OF ADDL. JUNIOR CIVIL JUDGE - CUM - JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
O.S.No. 178/2024
BETWEEN;
Bank of Baroda, Puttur Branch, Rep. by its Branch Manager, Puttur town and post, Tirupathi Dist. ....Plaintiff.
AND
G.B. Mahima Chandra and another ....Defendants
SUMMONS TO THE DEFENDANTS No.1 & 2
To
D1: G B. Mahima Chandra, W/o K. Balakrishna,
D2: K. Bala Krishna, S/o K.Nagabhushanam, Residing at No.1-31, Sri Ramapuram village & post, Nindra Mandal, Chittoor Dist.,
Both are Residing at D.No.18-36-S5-518, Prasanthi Nagar, Tirupathi, Tirupathi Dist.
Please take summons that, the plaintiff's bank filed the suit for recovery of debt basing on the loan amount in the above Hon'ble court against you and the above suit is posted to 31/07/2025 for your appearance. So, please to be attend on 31/07/2025 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.
Sd/- D. DAMODAR REDDY, B.A, B.L.,
ADVOCATE PUTTUR

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వాలి : సింగంశెట్టి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. వెలగపూడి లోని సచివాలయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్‌ను సుబ్బరామయ్య బుధవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పంచాయతీలకు రావలసిన నిధులు, సర్పంచులకు సకాలంలో ఫండ్స్ విడుదల చేస్తే గ్రామాల అభివృద్ధి మరింత జరిగే అవకాశం ఉందని మంత్రికి వివరించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో చర్చించి త్వరలో నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



టీటీడీ స్థానిక ఆలయాల్లో ఆణివార ఆస్థానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి శ్రీ గోవింద రాజస్వామి ఆలయం, కోదండ రామాలయం, శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాలలో బుధవారం సాయంత్రం ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో దీనికి ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం నాటి నుండి టీటీడీ ఆదాయ వ్యయాలు, నిల్వలు, వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి -ఏప్రిల్ నెలలకు మార్చారు.

టీటీడీ అనుబంధ ఆలయాల్లో ఆణివార ఆస్థానం నిర్వహిస్తున్న దృశ్యం

కాలువల్లో చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న సబ్‌యూనిట్ అధికారి వెంకటయ్య, హెల్త్ సూపరువైజరు

చెత్తా చెదారం కాలువల్లో వేయొద్దు

ప్రజాశక్తి - రేణిగుంట

పంచాయతీ పరిధిలో చెత్తాచెదారాన్ని కాలువలో వేయరాదని సబ్ యూనిట్ అధికారి వెంకటయ్య, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు తెలిపారు. బుధవారం బిస్మిల్లానగర్, బాలాజీకాలనీ, భగత్‌సింగ్ నగర్లో పర్యటించి ప్రజలకు పరిశుభ్రత, రోగాల నివారణపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. సమిష్టి కృషితో వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మేస్త్రి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్లు గిరి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఫస్ట్ ఏడీజే ఏపీపీ చంద్రశేఖర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తూరు జిల్లా కోర్టుల సముదాయంలో ఉన్న మొదటి అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా నియమితులైన మద్దిపట్లపల్లి చంద్రశేఖర్ నాయుడిని అఖిల భారతీయ యాదవ మహాసభ యువజన రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్ ఘనంగా సత్కరించారు. బుధవారం ఆయన కార్యాలయంలో శంకర్ యాదవ్ తో పాటు ధనంజయులు, వాసు, సురేష్ కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ప్రభుత్వం చంద్రశేఖర్ నాయుడును ఇటీవల ఏపీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేశారు.

చంద్రశేఖర్‌నాయుడుని సత్కరిస్తున్న శంకర్‌యాదవ్

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే రాష్ట్రాన్ని మళ్లీ సంక్షేమం అభివృద్ధి చేయడమే ధ్యేయమని నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని స్థానిక ఆరవ వార్డ్ లో సూపర్ సిక్స్ అమలు పాలనలో ముందడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమ పై ప్రజలకు కరపత్రాలు ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ డిఎస్ గణేష్, డి ఎన్. ఎలుమలై అమ్ములు, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు చెంచయ్య, శివయ్య, బాబు, బుజ్జి, మహిళ నాయకురాలు మోహన, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

22న మామిడి రైతుల మహాజన సభ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

మామిడి రైతు మహాజన సభను విజయవంతం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సంఘం రైతు సంక్షేమ సంఘం కన్వీనర్ ఆనంద నాయుడు కోరారు. బుధవారం ఈనెల 22వ తేదీ మంగళవారం మామిడి దినోత్సవ కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ సమావేశ మందిరంలో మామిడి రైతు సభ జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఉద్యానశాఖ అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వం ప్రకటించినట్లు రూ. 8లు చెల్లించాలని కానీ రూ.5,6లు మాత్రమే చెల్లిస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించినట్లు రూ.8లు పరిశ్రమలు, రూ.4లు సబ్సిడీ ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. సభకు రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కన్వీనర్లు హరిబాబు చౌదరి, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు నాయుడు, త్యాగరాజురెడ్డి పాల్గొన్నారు.

మండల టిడిపి అధ్యక్షుడి రేసులో ప్రసాద్

ప్రజాశక్తి- కార్వేటినగరం:

మండల టిడిపి అధ్యక్షుడు రేసులో కొప్పేటి ప్రసాద్ విశ్రాంతి గ్రామ పరిపాలన అధికారిగా పనిచేశారు. బుధవారం ఆలత్తూరు పంచాయతీ , టిటి కండిగా గ్రామంలో ప్రభుత్వ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ఆశీర్వాదం తీసుకున్నట్లు సమాచారం. 1983 నుంచి టిడిపి పార్టీకి వీరి కుటుంబంలో కీర్తిశేషులు కే పద్మనాభం నాయుడు 5 సార్లు మండల పార్టీ అధ్యక్షులుగా, ఒకసారి ఎంపీపీగా ఉన్న కుటుంబం వీళ్లది. శ్రీ వేణుగోపాలస్వామి, టిటిడి కళ్యాణమండపం, బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల వీళ్ళు అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సన్నిహిత సంబంధం ఉండేది. ఈ నేపథ్యంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులుగా కే.ప్రసాద్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కలిసిన సందర్భంగా తెలిపారు.

చెవిరెడ్డి కుమారులకు భరోసా ఇస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

అధైర్యపడకండి.. అండగా ఉంటా..!

చెవిరెడ్డి బిడ్డలకు జగనన్న భరోసా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

'అక్రమ కేసులు పెట్టారు.. జైలుకు పంపారని అధైర్య పడకండి.. అండగా నేనున్నాను.. భాస్కర్ నా సొంత మనిషి.. ఈ దొంగ కేసులు ఏమీ చేయలేవు..' అంటూ వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెవిరెడ్డి బిడ్డలకు భరోసా కల్పించారు. విజయవాడలోని తాడేపల్లి నివాసంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు జగనన్నను కలిశారు. ఏపీ లిక్కర్ స్కాం కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం, అదే కేసులో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నిందితునిగా చేర్చడం వంటి అంశాలపై చర్చించిన జగన్ 'మీరు ధైర్యంగా ఉండండి, న్యాయ పరంగా పోరాడుదాం.. మీకు నేను, పార్టీ అండగా ఉంటుంది..' అని మనోధైర్యం కల్పించారు. 'మీరే మా ధైర్యం, మీ మాటే మాకు బలం, మీ పోరాటమే మాకు స్ఫూర్తి జగనన్న..' అంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు బదులివ్వడంతో జగనన్న వారి భుజం తట్టి చిరునవ్వులు చిందించారు.

బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా శేషాద్రి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి నగర అధ్యక్షుడుగా ఎం శేషాద్రిని నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఆవులపాటి బుజ్జిబాబు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్న శేషాద్రి సంఘం బలోపేతానికి కూడా దోహద పడుతున్నారని బుజ్జిబాబు అన్నారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బుజ్జి బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శేషాద్రికి నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునుస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టరు థామస్

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు:

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని గ్రామాల్లో నిరుపేదలు కుటుంబాలు బంగారు కుటుంబాలుగా గుర్తించి అభివృద్ధి చెందే విధంగా వాళ్ళని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకురావడమే తన లక్ష్యమని యువతకు ఉద్యోగం కల్పించడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఓ శ్రీనివాసులు, జెడి నెల్లూరు ఎమ్మార్వో శ్రీనివాసులు, ఏవో లోకేష్, నియోజవర్గంలోని ఎమ్మార్వోలు ఎంపీడీవోలు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.